E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 21-07-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




నేడు, రేపు భారీ వర్షాలు » 2లో

ఎలక్ట్రిక్ కార్ల జోరు.. రానున్న రోజులు ఈవీలవే.. » 4లో



బుర్రకథ శిఖామణి జీవితంపై సినిమా » 5లో



జీవితంలో విజయం సాధించాలంటే మీరు చేయాల్సింది ఇదే.. స్టార్ హీరో ఇంట్రెస్టింగ్ కామెంట్స్ » 5లో



2031 వరకు డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఇంగ్లాండ్‌లోనే.. ప్రకటించిన ఐసీసీ » 6లో



# నేటి నుంచి పార్లమెంటు




## వర్షాకాల సమావేశాలు

- » కీలకాంశాలపై పార్లమెంట్‌లో చర్చిస్తాం: కేంద్రం
- » నేటి నుంచే వర్షా కాల సమావేశాలు
- » 8 కొత్త బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం
- » జస్టిస్ వర్మ అభిశంసన తీర్మానం కూడా.. సజావుగా సాగేందుకు సహకరించండి
- » అఖిలపక్ష భేటీలో విపక్షాలకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- » సిందూర్, ట్రంప్ వ్యాఖ్యలు.బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చించాల్సిందే
- » పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రకటన చేయాలి: విపక్షాలు



ఈ కబురు,దిల్లీ:పాకిస్తాన్ ఉగ్రవాదుల భరతం పట్టేందుకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సహా కీలక అంశాలపై పార్లమెంట్ వర్షా కాల సమావేశాల్లో చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 21వ తేదీ వరకు కొనసాగుతాయి. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తర్వాత జరుగుతున్న ఈ సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం కనిపిస్తోంది.

తరువాయి 2లో



## వరంగల్‌లో తెలంగాణ క్రీడాపాఠశాల

వెంటనే విధివిధానాలు రూపొందించాలని అధికారులకు సీఎం ఆదేశాలు

రేవంత్‌రెడ్డిని కలిసిన వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు

తరువాయి 2లో

## ఉపరాష్ట్రపతితో కేజ్రీవాల్ భేటీ..

రాజకీయాల్లో సంచలనం ! » 3లో



## డీలిమిటేషన్‌పై బీజేపీని నమ్మలేం

» జనాభా నియంత్రణను అద్భుతంగా పాటించింది దక్షిణాది రాష్ట్రాలే

- » నియోజకవర్గాల పునర్విభజనలో ఆ రాష్ట్రాలకు తీవ్ర నష్టం
- » మందబలం చూసుకుని బీజేపీ ఏమైనా చేస్తామంటే కుదరదు
- » జైపూర్ టాక్ జర్నలిజం 9వ ఎడిషన్ చర్చలో బీఆర్ఎస్ నేత కేటీఆర్



## రింగ్ మాస్టర్ మిథున్‌రెడ్డే



- » విచారణకు ఏ మాత్రం సహకరించలేదు
- » పైగా.. తప్పుదారి పట్టించే యత్నం చేశారు
- » ఎంపీ కనుసన్నల్లోనే షెల్ కంపెనీల ఏర్పాటు
- » నగదు మళ్లింపూ ఆయన ఆధ్వర్యంలోనే
- » సిండికేట్ నుంచి పీఎల్ఆర్ ప్రాజెక్టుకు సొమ్ము
- » నాటి సీఎంకు చేరిన నిధులు.. లెక్క తేల్చాల్సిందే
- » రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు.. కస్టడీకి వినతి

తరువాయి 2లో

## హైదరాబాద్‌లో వైభవంగా బోనాల వేడుకలు

- » బోనమెత్తిన భాగ్యనగరం
- » అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- » 2,783 ఆలయాల్లో బోనాలకు 20కోట్లు: భట్టి



ఈ కబురు: శివసత్తుల ఊరేగింపులు, పోత రాజుల విన్యాసాలు, తీన్మార్ డప్పులతో స్టెప్పులు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, జానపద గీతాలు.. ఎటు చూసినా భక్త జన సందోహం, సందడే సందడి... వెరసి భాగ్యనగరం ఆదివారం ఆషాఢ బోనల జాతర శోభ సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ హైదరాబాద్ నగర వీధులన్నీ బోనాల ఉత్సవాలతో సందడిగా కనిపించాయి. హైదరాబాద్‌లో ఉన్న అన్ని అమ్మవారి ఆలయాల్లో బోనాల జాతరలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు అమ్మవార్లకు బోనం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అయితే, ప్రధాన ఆలయాల వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. లాల్‌దర్వాజాలోని సింహవాహని ఆలయం, హరిబౌలి అక్కన్నమాదన్న మహంకాళి, చార్మినార్ భాగ్యలక్ష్మి, గౌలిపురా కోటమైసమ్మ, బేలాచందూలాల్ ముత్యాలమ్మ, మీర్‌ఆలంమండి మహంకాళి, కార్వాన్‌దర్బార్ మైసమ్మ, ఎల్‌బీనగర్ ఖిల్లామైసమ్మ తదితర ఆలయాల్లో అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం పట్టు వస్త్రాలు సమర్పించింది. లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అక్కన్నమాదన్న ఆలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, గౌలిపురాలో మంత్రి వాకిటి శ్రీహరి, మీర్‌ఆలంమండి ఆలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎల్‌బీనగర్‌లోని ఖిల్లామైసమ్మ ఆలయంలో మంత్రి సీతక్క, ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాలిబండ బంగారు మైసమ్మ ఆలయంలో ప్రభుత్వం తరపున మేయర్ విజయలక్ష్మిపట్టువస్త్రాలు సమర్పించారు.

తరువాయి3లో




## హెచ్1బి వీసా విధానంలో భారీ మార్పులు.. పొజిషన్ ఆధారంగా జారీ!

» 3లో



## రష్యాతో శాంతి చర్చలకు సిద్ధం

» 3లో

## చైనాలో

తుఫాను బీభత్సం.. 400 భవనాలు ధ్వంసం » 3లో



మొదటి పేజీ తరువాయి

# నేటి నుంచి పార్లమెంటు వర్షా కాల సమావేశాలు



ఈ కబురు,ఢిల్లీ:పాకిస్తాన్ ఉగ్రవాదుల భరతం పట్టేందుకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సహా కీలక అంశాలపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 21వ తేదీ వరకు కొనసాగుతాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తర్వాత జరుగుతున్న ఈ సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం కనిపిస్తోంది. పార్లమెంట్ లేవనెత్తాల్సిన కీలక అంశాలపై విపక్షాలు కసరత్తు పూర్తిచేశాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమయ్యాయి. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనపై వర్షాకాల సమావేశాల్లో తీర్మానం ప్రవేశపెట్టబోతున్నారు.


**నిర్మాణాత్మక చర్చలకు సహకరించాలి**

వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు, ఉభయ సభల్లో నిర్మాణాత్మక చర్చలు జరిగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా అధ్యక్షతన ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, అర్జున్‌రామ్ మేఘ్వాల్, మురుగన్‌తో పాటు కాంగ్రెస్ ఆర్జేడీ, జేడీ(యూ), సమాజ్‌వాదీ పార్టీ, వైఎస్సార్‌సీపీ, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్, టీఎంసీ, బీఆర్ఎస్, శివసేన(షిండే), ఆమ్ ఆద్మీ తదితర పార్టీల సభ్యులు హాజరయ్యారు. విపక్షాలు తమ ఎజెండాను ప్రస్తావించాయి. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, పహల్గాం ఉగ్రవాద దాడి, భారత్-పాక్ ఘర్షణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను లేవనెత్తాయి. పొరుగు దేశాలతో విదేశాంగ విధానం, తాజా పరిస్థితులపై పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల కష్టాలు, దేశ ఆర్థిక వ్యవస్థ, మణిపూర్ అంశాలపై పూర్తిస్థాయిలో చర్చించాలని కోరాయి. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చ చేపట్టాలని డీఎంకే అభ్యర్థించింది. అఖిలపక్ష భేటీ అనంతరం కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మీడియాతో మాట్లాడారు. భారత్-పాక్ మధ్య యుద్ధం ఆపేశానంటూ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దుశ్చర్యకు దారితీసిన భద్రతా లోపాలు, బిహార్‌లో ఓట్ల జాబితా సవరణపై ప్రధాని మోదీ మాట్లాడాలని కోరినట్లు తెలిపారు.కొత్త బిల్లులు వర్షాకాల సమావేశాల్లో కేంద్రం 8 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. మణిపూర్ వస్తువులు, సేవల పన్ను(సవరణ) బిల్లు, జన్ విశ్వాస్(నిబంధనల సవరణ) బిల్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు, పన్నుల చట్టాలు(సవరణ) బిల్లులతో పాటు జియోహెరిటేజ్ సైట్స్, జియో-రెలిక్స్(సంరక్షణ), జాతీయ క్రీడా పాలన బిల్లు, జాతీయ డోపింగ్ నిరోధక(సవరణ) బిల్లులను ప్రవేశపెట్టనుంది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించడానికి ప్రభుత్వం పార్లమెంట్ ఆమోదం కోరనుంది. వీటితోపాటు పెండింగ్‌లో ఉన్న సముద్ర వస్తువుల రవాణా బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, ఓడరేవుల బిల్లులపై చర్చించి, ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి.

**చర్చకు వెనుకాడం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు**

ఆపరేషన్ సిందూర్ సహా జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కలిగిన కీలక అంశాలపై పార్లమెంట్‌లో చర్చకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇస్తామన్నారు. అఖిలపక్ష భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలు ఎలాంటి అంతరాయాలు లేకుండా సజావుగా కొనసాగేందుకు అధికార, విపక్ష సభ్యులు కలిసికట్టుగా పని చేయాలన్నారు.

వర్షాకాల సమావేశాలు ఫలవంతం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పార్టీలకు, కూటములకు వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నప్పటికీ పార్లమెంట్ కార్యకలాపాలకు సహకరించాల్సిన బాధ్యత అన్ని పక్షాలపైనా ఉందన్నారు. ఉభయ సభల్లో మాట్లాడేందుకు ఎక్కువ సమయం ఇవ్వాలని చిన్న పార్టీల ఎంపీలు కోరారని, అందుకోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. చిన్న ఎంపీలకు తగినంత సమయం ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు మినహా మిగతా సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ సమావేశాలకు హాజరవుతారని కిరణ్ రిజిజు వెల్లడించారు. విపక్షాలు లేవనెత్తే అంశాలపై సంబంధిత కేబినెట్ మంత్రులు సమాధానం ఇస్తారని స్పష్టంచేశారు. 17 బిల్లులు ప్రవేశపెట్టబోతున్నామని, వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.



> భారత్–పాక్ మధ్య యుద్ధం ఆపేశానంటూ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు, పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దుశ్చర్యకు దారితీసిన భద్రతా లోపాలు, బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ప్రధాని మోదీ స్పందించాలి. పొరుగు దేశాలతో విదేశాంగ విధానం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతుల కష్టాలు, దేశ ఆర్థిక వ్యవస్థ, మణిపూర్ అంశాలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్చించాలి.
>
> – గౌరవ్ గొగోయ్, కాంగ్రెస్ ఎంపీ

> ఆపరేషన్ సిందూర్ సహా జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కలిగిన కీలకాంశాలపై పార్లమెంట్‌లో చర్చకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదు. విపక్షాల ప్రశ్నలన్నింటికీ మేం సమాధానం ఇస్తాం. అయితే పార్టీలకు, కూటములకు వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నప్పటికీ పార్లమెంట్ కార్యకలాపాలకు సహకరించాల్సిన బాధ్యత అన్ని పక్షాలపైనా ఉంది. విదేశీ పర్యటనలో ఉన్న రోజుల్లో మినహా మిగతా సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ సమావేశాలకు హాజరవుతారు.
>
> – కిరణ్ రిజిజు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి

మొదటి పేజీ తరువాయి

# రింగ్ మాస్టర్ మిథున్‌రెడ్డే

ఈ కబురు: "వైసీపీ హయాంలో జరిగిన మద్యం ముడుపుల దందాలో రాజంపేట ఎంపీ, వైసీపీ నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డే రింగ్‌మాస్టర్. మద్యం సిండికేట్‌కు ప్రాణంపోసింది మొదలు రూ.3,200 కోట్ల మేర సొమ్మును దోచుకునేందుకు జరిగిన వ్యూహాత్మక నేరపూరిత కుట్ర రూపకల్పన, దాని అమలకు ఆయనే కర్త, కర్మ, క్రియ." అని ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కుండబద్దలు కొట్టింది. మద్యం ముడుపుల కుంభకోణం ఆలోచన ఇచ్చి, దాన్ని ఆచరణలోకి తీసుకొచ్చి, వేలకోట్ల సొమ్మును కొల్లకొట్టడంలో ఆది నుంచి అంతం వరకు, నాటి ముఖ్యమంత్రికి అవినీతి సొమ్ము చేరే దాకా ఈ ఎంపీనే ప్రధాన పాత్రధారి అని వెల్లడించింది. శనివారం రాత్రి ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయనపై ఐపీసీ సెక్షన్లు 409, 420, 384, 201, 120(బీ), రెడ్‌విత్ సెక్షన్ 34, 37లతోపాటు, అవినీతి నిరోధక చట్టం(పీసీఏ) 1988లోని సెక్షన్7, 7ఏ, 8, 12, 12(1)(బీ), 13(2)ల కింద కేసులు నమోదు చేసింది. ఈ సందర్భంగా సిట్ సమర్పించిన రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలను ప్రస్తావించింది. నాటి ముఖ్యమంత్రి జగన్‌కు అవినీతి సొమ్ము చేరిందన్న అంశాన్ని ప్రస్తావిస్తూనే, మద్యం ముడుపుల దందాలో మిథున్‌రెడ్డి పాత్ర ఎలా మొదలైంది? ఆయన ఏం చేశారో సవివరంగా పేర్కొంది.



అలా మొదలైంది..

201419 మధ్య లిక్కర్ పాలసీ ఆటోమెటిక్ పంపిణీ విధానంలో కొనసాగింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక మద్యం వ్యాపారం నుంచి నెలవారీగా ముడుపులు రాబట్టుకోవాలని మిథున్‌రెడ్డి ప్రణాళిక చేశారు. అయితే, ముడుపులకు ప్లాన్ చేయమని ఆయనకు ఎవరు చెప్పారు? ఆ తెరవెనక ఉన్న శక్తి ఎవరు? తేలాల్సి ఉందని సిట్ పేర్కొంది. విచారణ సందర్భంగా ఎంపీ తమకు సహకరించలేదని, కీలకమైన అంశాల్లో దాటవేత ధోరణిని కనబర్చారని రిపోర్టులో తెలిపింది. ఈ దందాలో ప్రమేయం ఉన్నవారిని కాపాడేందుకు, కొత్తగా మరెవరి పాత్ర వెలుగులోకి రాకుండా ఉండేందుకు మొత్తం అంశాన్ని తప్పుదోవ పట్టించేలా మిథున్ వ్యవహరించారని సిట్ పేర్కొంది.

కుట్రకు రూపశిల్పి

2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక మద్యం నుంచి రూ.వేల కోట్లను ముడుపుల రూపంలో పిండుకోవాలని ప్లాన్ వేశారు. ఈ ముడుపుల దందా ఎలా ఉండాలి? ఎలా అమలు చేయాలి? ఎవరెవరు భాగస్వాములవ్వాలి? డిస్టిలరీస్ ఏం చేయాలి? ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఎలా వాడుకోవాలి? అక్కడి అధికారులను గుప్పిట్లో పెట్టుకొని తమ పన్నాగాలను ఎలా అమలు చేయాలన్న అంశాలన్నీ మిథున్‌రెడ్డి ఆలోచన నుంచి వచ్చినవే. నిర్మాణాత్మక నేరపూరిత నిధుల దోపిడీ కుట్రకు మిఽథున్‌రెడ్డి తిరుపతిలోని తన ఇంటి నుంచే శ్రీకారం చుట్టారు. బేవరేజెస్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న సత్యప్రసాద్‌ను ఈ కుట్రకు పావుగా వాడుకోవాలనుకున్నారు. ముడుపుల దందాపై చర్చించేందుకు తిరుపతిలోని తన నివాసానికి 2019, అక్టోబరు 10న సత్యప్రసాద్‌ను పిలిపించుకుని, మద్యం సిండికేట్ కోసం పనిచేయాలని ఆదేశించారు. ప్రతిఫలంగా ఆయనకు 2023 కోటాలో ఐఏఎస్ పదోన్నతి కల్పిస్తామని ఆశచూపారు. దీంతో సత్యప్రసాద్ లొంగిపోయారు. 3 రోజుల తర్వాత(13102019) రెండో మీటింగ్ హైదరాబాద్‌లో అప్పటి ఎంపీ విజయసాయి రెడ్డి నివాసంలో జరిగింది.ఈ సమావేశంలోనే మద్యం సిండికేట్ పనితీరు, డిస్టిలరీస్ నుంచి ముడుపులు ఎలా వసూలు చేయాలి? ఏయే బ్రాండ్లను ప్రోత్సహించాలి? డిస్టిలరీస్‌తోపాటు, మద్యం కంపెనీల నుంచి నెలవారీ ముడుపులు ఎలా వసూలు చేయాలి? అన్న అంశాలపై కీలక చర్చ జరిగింది. నెలకు రూ.5060 కోట్ల మేరకు మద్యం ముడుపులు రాబట్టాలనిప్లాన్ చేశారు. మద్యం అమ్మకాల బేస్ ధరపై కనీసం 12 శాతం కమీషన్ వసూలు చేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి ప్రతిపాదించారు. తన ప్లాన్ పక్కాగా అమలు చేసేందుకు సత్యప్రసాద్, వాసుదేవరెడ్డిలకు కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారు. మద్యం అమ్మకాలకు సంబంధించి 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆటోమేటిక్ విధానం తీసేయాలని, ఆ స్థానంలో మాన్యువల్ పంపిణీ విధానం తీసుకురావాలని సూచించారు.

ముడుపుల సొమ్ముతో..

డిస్టిలరీల నుంచి వసూలు చేసిన సొమ్ముతో బంగారం కొనుగోలు, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భారీగా పెట్టుబడులు పెట్టించారు. ఆఫ్రికా, దక్షిణాసియా, అమెరికాల్లో అక్రమ పెట్టుబడులు పెట్టించారు. ఇవే కాకుండా ఎస్‌పీవై ఆగ్రోస్, శాన్‌లాబ్, డీకార్ట్ లాజిస్టిక్స్ మధ్య రూ.కోట్ల లావాదేవీలు నడిపించారు. పేమెంట్స్ డిస్కౌంట్స్‌లో మానిప్యులేషన్ చేయడం ద్వారా బేవరేజెస్ కార్పొరేషన్‌కి రూ.200 కోట్ల నష్టం కలిగించడంలో ఎంపీ కీలక పాత్రధారుగా ఉన్నారు. కీలక నిందితులతో ఎంపీ మిథున్‌రెడ్డి వాట్సాప్ చాటింగ్ చేశారు. 2023, మే నుంచి 2024, మే వరకు ఏడాది కాలంలో కృష్ణమోహన్‌రెడ్డి(55 సార్లు), చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(23 సార్లు), మోహిత్‌రెడ్డి(4 సార్లు), వాసుదేవరెడ్డి, ధనుంజయ్‌రెడ్డిలతో అనేక సార్లు ఫోన్‌లో మాట్లాడారు. రజత్‌భార్గవ, ఈ కేసులో సాక్షిగా ఉన్న బీవీఎస్ డిస్టిలరీస్ ఎండీ వెంకటసుబ్బారావుతో కూడా మిథున్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడినట్లు సిట్ పలు ఆధారాలను సమర్పించింది.

అడ్డంగా దొరికింది ఇక్కడే

మద్యం సిండికేట్‌లో కీలంగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి.. ఎస్‌పీవై ఆగ్రోస్, శాన్‌హాక్ లాబ్, డీకార్ట్ లాజిస్టిక్స్ మధ్య రూ.కోట్ల లావాదేవీలు నడిపించారు. చివరకు డీకార్ట్ లాజిస్టిక్స్ ఖాతా నుంచి పీఎల్ఆర్ ప్రాజెక్టుకు రూ.5 కోట్ల నిధులు వెళ్లాయి. ఈ విషయంలోనే ఎంపీ అడ్డంగా దొరికిపోయారు. పీఎల్ఆర్ ప్రాజెక్టు అనేది ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబ కంపెనీ. కాబట్టి, డీకార్ట్ లాజిస్టిక్స్ నుంచి పీఎల్ఆర్ ప్రాజెక్టు కంపెనీకి నిధులు రావడం అనేది లిక్కర్ కుంభకోణంలో ఆయన పాత్రను స్పష్టం చేస్తోంది. అంతేకాదు, సిండికేట్‌లోని కంపెనీల నుంచి ఎంపీ కుటుంబ వ్యాపారాలకు రూ.కోట్ల నిధులు వెళ్లడం కూడా యాదృచ్ఛికంకాదు. ఎంపీ నేతృత్వంలోనే మనీ లాండరింగ్ జరిగింది. ఆయా విషయాలపై పక్కా ఆధారాలను ఎంపీ ముందు ఉంచి ప్రశ్నిస్తే.. దాటవేసే ప్రయత్నం చేశారు. ఈ దందాలో ఇతరులను కాపాడేలా వ్యవహరించారు. విచారణకు సహకరించలేదు. ఈ కేసులో అన్ని అంశాలను వెల్లడించాల్సింది ఎంపీనే. ఎంపీ కుటుంబానికి పీఎల్ఆర్‌తోపాటు 'శివశక్తి డైరీ' కూడా ఉంది. ఇంకా అనేక లెక్కలు తేలాల్సి ఉంది. కాబట్టి ఆయన్ను కస్టడీకి ఇవ్వాలి.

ఇదీ లెక్క!

డిస్టిలరీలు, కంపెనీలతో ముడుపుల వ్యవహారాన్ని చర్చించేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేకంగా మనుషులను నియమించారు. 201819లో 30 లక్షల కేసుల ఇండియన్ మేడ్ లిక్కర్, 10 లక్షల కేసుల బీరు అమ్ముడుపోయా యి. కాబట్టి, ఒక్కో కేసుపై రూ.150 600 మేరకు మద్యం ముడుపులు వసూలు చేయాలని ఎంపీ సూచించారు. ముడుపులు చెల్లించేందుకు అంగీకరించిన డిస్టిలరీల నుంచే సరుకు తీసుకుని, వాటినే ప్రభుత్వ రిటైల్ దుకాణాల్లో విక్రయించాలని ఎంపీ ఆదేశించారు. ఈ మేరకు డిస్టిలరీల నుంచి తీసుకునే ముడుపులను(బేస్ ధరపై) 12 నుంచి 20 శాతానికి పెంచారు. ఇలా వచ్చిన సొమ్ము రాజ్ కసిరెడ్డి, మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి తదితరుల ద్వారా నాటి సీఎం జగన్‌కు చేరింది. డిస్టిలరీల నుంచి డబ్బు వసూలు బాధ్యత తను రాజ్ కసిరెడ్డి చూడగా, ఆ సొమ్మును నాటి సీఎంకి చేర్చడంలో మిథున్‌రెడ్డి పాత్ర ఉంది.

# నేడు, రేపు భారీ వర్షా లు



**ఈ కబురు,హైదరాబాద్, : రాష్ట్రం లో సోమ, మంగళవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు రోజుల పాటు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షా లు అక్కడక్కడా కురుస్తాయని పేర్కొంది.**

**ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక సిరిసిల్ల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగి రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.**

# హైదరాబాద్‌లో వైభవంగా బోనాల వేడుకలు



ఈ కబురు: శివసత్తుల ఊరేగింపులు, పోతరాజుల విన్యాసాలు, తీన్మార్ డప్పులతో స్టెప్పులు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, జానపద గీతాలు.. ఎటు చూసినా భక్త జన సందోహం, సందడే సందడి... వెరసి భాగ్యనగరం ఆదివారం ఆషాఢ బోనల జాతర శోభ సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ హైదరాబాద్ నగర వీధులన్నీ బోనాల ఉత్సవాలతో సందడిగా కనిపించాయి. హైదరాబాద్‌లో ఉన్న అన్ని అమ్మవారి ఆలయాల్లో బోనాల జాతరలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు అమ్మవార్లకు బోనం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అయితే, ప్రధాన ఆలయాల వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. లాల్‌దర్వాజాలోని సింహవాహని ఆలయం, హరిబౌలి అక్కన్నమాదన్న మహంకాళి, చార్మినార్ భాగ్యలక్ష్మి, గౌలిపురా కోటమైసమ్మ, బేలాచందూలాల్ ముత్యాలమ్మ, మీర్‌ఆలంమండి మహంకాళి, కార్వాన్‌దర్బార్ మైసమ్మ, ఎల్‌బీనగర్ ఖిల్లామైసమ్మ తదితర ఆలయాల్లో అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం పట్టు వస్త్రాలు సమర్పించింది. లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అక్కన్నమాదన్న ఆలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, గౌలిపురాలో మంత్రి వాకిటి శ్రీహరి, మీర్‌ఆలంమండి ఆలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎల్‌బీనగర్‌లోని ఖిల్లామైసమ్మ ఆలయంలో మంత్రి సీతక్క, ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాలిబండ బంగారు మైసమ్మ ఆలయంలో ప్రభుత్వం తరఫున మేయర్ విజయలక్ష్మిపట్టువస్త్రాలు సమర్పించారు.

లాల్‌దర్వాజాలో పట్టువస్త్రాల సమర్పణ అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.1290 కోట్లు వ్యయం చేస్తోందని తెలిపారు. రాజధానిలోని 2,783ఆలయాల్లో బోనాల నిర్వహణకు రూ.20కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. కాగా, లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ చామల కిరణ్, మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, డిప్యూటి స్పీకర్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, బీజేపీ నేత లక్ష్మణ్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. బోరబండలోని శ్రీపోచమ్మ ఆలయంలోని అమ్మవారికి సినీనటి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి బంగారు బోనం సమర్పించగా.. మంత్రులు తుమ్మల, పొన్నం పట్టువస్త్రాలు సమర్పించారు. హరియాణా మాజీ గవర్నర్ దత్తాత్రేయ నివాసంలో జరిగిన బోనాల వేడుకల్లోగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

# వరంగల్‌లో తెలంగాణ క్రీడాపాఠశాల



ఈ కబురు, హైదరాబాద్: వరంగల్‌లో తెలంగాణ క్రీడా పాఠశాల ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించి.. అందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు క్రీడాశాఖ కార్యదర్శితో ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల బృందం కడియం శ్రీహరి నేతృత్వంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసింది.

ఈ బృందంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజులు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ చాలాసేపు మాట్లాడారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఒక్క స్టేడియం మాత్రమే ఉందని, జిల్లా క్రీడా అథారిటీ ఆధ్వర్యంలో వివిధ క్రీడల నిర్వహణకు ఉపయోగపడుతోందని, శిక్షణ కోసం కూడా ఉపయోగిస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు సీఎంకు వివరించారు.

వరంగల్ అన్ని వైపులా విస్తరిస్తున్న నేపథ్యంలో జనాభా పెరుగుతోందని, ఇందుకు అనుగుణంగా క్రీడా సేవల విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం అవసరాలను తీర్చలేకపోతోందని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు తెలంగాణ క్రీడా పాఠశాలను మంజూరు చేయడం ద్వారా ప్రత్యేక క్రీడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించొచ్చని, ఈ పాఠశాలు ఏర్పాటుకు అవసరమైన 20 ఎకరాల ప్రభుత్వ భూమి ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలో అందుబాటులో ఉందన్నారు.

వరంగల్‌కు చెందిన విద్యార్థులు క్రికెట్ ఆడటానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో క్రికెట్ కోసం ప్రత్యేక స్టేడియం ఏర్పాటు చేయాలని కూడా కోరారు. క్రీడా పాఠశాలతోపాటు ప్రత్యేక క్రికెట్ స్టేడియాన్ని వీలున్నంత త్వరగా మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి క్రీడా పాఠశాలతో పాటు ప్రత్యేక క్రికెట్ స్టేడియం ఏర్పాటుతో పాటు జిల్లా అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు.

ఆసక్తికర భేటీ

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు, మంత్రి కొండా సురేఖ దంపతులకు విభేదాలు వచ్చిన నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ ప్రత్యేకంగా భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల సీఎం రేవంత్ మంత్రి సురేఖ, ఆమె కుమార్తె సుస్మితా పటేల్‌తో తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు.

ఇప్పుడు ఆమెను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలతో భేటీ కావడంతో ఈ సమావేశంలో రాజకీయంగా ఏం చర్చ జరిగిందన్నది ఆసక్తి నెలకొంది. ఇరుపక్షాలకు సర్దిచెప్పేందుకే రేవంత్ విడివిడిగా ఉమ్మడి వరంగల్ నేతలతో సమావేశమయ్యారని, వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలను కొంతకాలం పక్కనపెట్టేలా ఈ భేటీలో చర్చలు జరిగాయని తెలుస్తోంది.

# ఘనంగా బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు జన్మదిన వేడుకలు




కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న హరీష్ రావు



కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న హరీష్ రావు

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వాలా హరీష్ రావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసిన హరీష్ రావు జన్మదిన వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల మధ్య జన్మదిన వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమకారులుగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో పాలుపంచుకున్న సంతోషం బీఆర్ఎస్ నాయకులకే దక్కుతుందని అన్నారు. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రజలు అధికార కాంగ్రెస్ పార్టీ పాలనతో విసిగిపోయారని, మరోసారి కెసిఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ శ్రేణులు, కాలనీవాసులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌పై బీజేపీని నమ్మలేం



ఈ కబురు, హైదరాబాద్: ఉత్తర భారతదేశంలోని ఎంపీల సంఖ్యపై ఆధారపడి ఏర్పడే కేంద్ర ప్రభుత్వం.. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అవకాశం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. ఉత్తరప్రదేశ్ లాంటి ఒక్క రాష్ట్రం ఎంపీలే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారడం సమాఖ్య వ్యవస్థకు మంచిది కాదని తెలిపారు. జైపూర్‌లో జరుగుతున్న 'టాక్ జర్నలిజం'9వ ఎడిషన్ చర్చా కార్యక్రమంలో కేటీఆర్ ఆదివారం మాట్లాడారు. జనాభా నియంత్రణను అద్భుతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజనలో తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. డీలిమిటేషన్‌లో దక్షిణాదికి అన్యాయం జరగనివ్వబోమని బీజేపీ ప్రభుత్వం చెబుతున్న మాటలను నమ్మలేమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే స్థానాలు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు పెంచలేదని గుర్తుచేశారు. అడగకముందే వారి రాజకీయ ప్రయోజనాల కోసం జమ్మూకశ్మీర్, అస్సాంలో మాత్రం అసెంబ్లీ సీట్లను పెంచారని మండిపడ్డారు. మంద బలం, అధికారం ఉందన్న అహంకారంతో జాతీయ భాషగా హిందీని బలవంతంగా రుద్దుతామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంలో తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీ లన్నీ ఏకాభిప్రాయంతోనే ఉన్నాయని తెలిపారు. 'దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. తనకు ఇష్టం వచ్చిన పనులు చేస్తానని బీజేపీ అనుకుంటే.. ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఆ పార్టీ నే బాధ్యత వహించాల్సి ఉంటుంది'అని స్పష్టంచేశారు.

బిహార్ ఓటర్ సర్వేపై అనుమానాలు

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో అర్హత కలిగిన ఏ ఒక్క వ్యక్తి కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదని కేటీఆర్ అన్నారు. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల సవరణ మొదటిసారి కానప్పటికీ దానిపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయని, కేంద్ర ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. బిహార్ పరిణామాలపై తమకు చాలా అభ్యంతరాలు ఉన్నాయని, దేశంలోని మిగతా రాష్ట్రాలపై దీని ప్రభావం ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో గెలవడం కోసం ప్రజల మధ్య విభేదాలు, విద్వేషాలు సృష్టించడం చాలా సులభమని అన్నారు.

బిహార్ పరిణామాలు ప్రజలను విడగొట్టే రాజకీయ కుట్రలో భాగమేనని అనుమానం వ్యక్తంచేశారు. ఎన్నికల తరువాత ఫలితాలపై మాట్లాడటం కంటే ముందే ఇలాంటి విషయాల మీద దృష్టి పెట్టాలని సూచించారు. బిహార్‌లో 5 లక్షల మంది ఓట్లు గల్లంతు కావటం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. గత ఎన్నికల్లో కేవలం 12,500 ఓట్ల తేడాతో అక్కడ ఆర్జేడీ అధికారాన్ని కోల్పోయిందని గుర్తుచేశారు. ముందు దేశం.. ఆ తర్వాతే ప్రాంతం, మతం, కులం అని స్పష్టంచేశారు.

# విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి



ఈ-కబురు, శేరిలింగంపల్లి : ప్రైవేట్ హాస్టల్ నిర్వహిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో అదే హాస్టల్లో మృతి చెందాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నెల్లూరు జిల్లా సీతారాంపురం మండలం గుండుపల్లి గ్రామానికి చెందిన రాచర్ల కొండల్ రావు(43) నగరానికి వలస వచ్చి గత మూడేళ్లుగా రాయదుర్గంలోని మధురానగర్ లో సాయిలక్ష్మి బాలాజీ ఉమెన్స్ పీజీ హాస్టల్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం హాస్టల్ పార్కింగ్ ప్రదేశాన్ని నీటితో కడుగుతూ అక్కడే ఉన్న డ్రమ్మును జరుగుతుండగా విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ షాక్ తో అపస్మారక స్థితికి చేరుకున్న కొండల్ రావుని కుటుంబ సభ్యులు వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. కాగా అప్పటికే కొండలరావు మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. దీంతో మృతుని భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# చీడ, పీడల నుంచి కాపాడే తల్లులు గ్రామ దేవతలు : మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్



అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బిక్షపతి యాదవ్, గంగాధర్ రెడ్డి



భక్తుల పూజలు అందుకున్న అమ్మవారు



అమ్మవారికి సమర్పించే బోనాలతో జాతరగా వస్తున్న గోపనపల్లి మహిళలు

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రజలకు ఏ కష్టం రాకుండా చీడ, పీడల నుంచి కాపాడే తల్లులు గ్రామ దేవతలని శేరిలింగంపల్లి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మారబోయిన బిక్షపతి యాదవ్ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ లో నిర్వహించిన ఆషాడమాస బోనాల ఉత్సవాల్లో స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి ఆదివారం మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర, రాయదుర్గం, ఎన్టీఆర్ నగర్, గోపనపల్లి ,గోపనపల్లి తండాలలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బిక్షపతి యాదవ్, గంగాధర్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ గ్రామ దేవతలైన పోచమ్మ, ఎల్లమ్మ ,మైసమ్మ, పెద్దమ్మ,ఎల్లమ్మ తల్లుల దీవెనలతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.అమ్మవారికి నైవేద్యం సమర్పించి చీడ పీడల నుంచి మమ్మల్ని కాపాడు తల్లి అంటూ భక్తులు గ్రామ దేవతను మొక్కుకుంటూ ఘనంగా నిర్వహించే వేడుక బోనాలు అని అన్నారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరికి అమ్మ వారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ డివిజన్ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. ఆషాడ మాసలో బోనాల పండుగను తెలంగాణ ప్రజలు ఎంతో భక్తితో నిర్వహిస్తారని తెలిపారు.మన సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ఒక ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని సీనియర్ నాయకులు,కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ అధ్యక్షులు, బీజేపీ పార్టీ నాయకులు దేవాలయ కమిటీ సభ్యులు ,భక్తులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# హెచ్1బి వీసా విధానంలో భారీ మార్పులు.. పొజిషన్ ఆధారంగా జారీ!




ఈ కబురు:అమెరికాలో హెచ్1బి వీసాల జారీ విధానంలో కీలక మార్పులు రాబోతున్నట్లు సంకేతాలు వినిపిస్తున్నాయి. ట్రంప్ కార్యవర్గం, మరోసారి ఈ వీసా విధానాన్ని కట్టడి చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ, ఓ ప్రతిపాదనను వైట్‌హౌస్‌లోని ఇన్ఫర్మేషన్ అండ్ రెగ్యులేటరీ అఫైర్స్ కార్యాలయానికి సమర్పించింది.ప్రస్తుతం హెచ్1బి వీసాలపై ఉండే వార్షిక పరిమితిని అమెరికా కాంగ్రెస్ నిర్ణయిస్తుంది. ప్రస్తుతం అది 85,000గా ఉండగా, ఇందులో 20,000 వీసాలను మాస్టర్స్ డిగ్రీ ఉన్నవారికి రిజర్వ్ చేస్తారు. పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాల విభాగాల కోసం మాత్రం పరిమితులు లేవు. అయితే, 2026 సంవత్సరానికి ఇప్పటికే అవసరమైన దరఖాస్తులు వచ్చిపోవడంతో, యూఎస్‌సీఐఎస్ ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిందని ప్రకటించింది. దీనివల్ల లాటరీ విధానం రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు దరఖాస్తుదారుల ఎంపికకు లాటరీ విధానాన్ని అనుసరిస్తూ వచ్చారు. ట్రంప్ 2017లో అధికారంలోకి వచ్చిన తర్వాత, వీసాలను లాటరీ ద్వారా కాకుండా ఆ ఉద్యోగానికి ఆఫర్ చేసే జీతం ఆధారంగా జారీ చేశారు. దీని వెనుక ఉద్దేశ్యం.. అమెరికన్ కంపెనీలు అధిక నైపుణ్యం ఉన్నవారిని నియమించుకునేలా ప్రోత్సహించడం, తక్కువ వేతనాల ఉద్యోగాల్లో విదేశీయుల నియామకాన్ని నియంత్రించడమే. దీనిని 'బై అమెరికన్, హైర్ అమెరికన్' విధానంగా ప్రచారం చేశారు.అయితే, 2021లో బైడెన్ అధికారంలోకి రాగానే ఈ విధానాన్ని పక్కనబెట్టారు. ఇక తాజాగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ పంపిన ప్రతిపాదనపై భారీగా స్పందన లభించింది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం దాదాపు 1,000 పబ్లిక్ కామెంట్లు అందాయి. ఇది అమలైతే హెచ్1బి ఉద్యోగులు తగ్గిపోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇంతవరకు లాటరీ విధానం, ఎవరికైనా సమాన అవకాశాలతో అమలవుతూ వచ్చింది. కానీ పెద్ద పెద్ద కంపెనీలు భారీగా దరఖాస్తులు చేసేసి అధికంగా వీసాలు పొందుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్రోగ్రెస్' అనే థింక్‌ట్యాంక్ జనవరిలో లాటరీ విధానాన్ని రద్దు చేసి, సీనియార్టీ, జీతాల ఆధారంగా వీసాల జారీ చేపట్టాలన్న సిఫార్సు చేసింది. అలా జరిగితే వీసాల ఆర్థిక విలువ దాదాపు 88 శాతం పెరిగే అవకాశముందన్న విశ్లేషణ కూడా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో హెచ్1బి వీసా విధానంలో మళ్లీ కీలక మలుపు తలెత్తబోతున్నట్లు అనిపిస్తోంది.

# రష్యాతో శాంతి చర్చలకు సిద్ధం

ఈ కబురు,కీవ్: రష్యాతో గత నెలలో నిలిచిపోయిన శాంతి చర్చలను తిరిగి ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఉక్రెయిన్ ప్రకటించింది. ఈ మేరకు వచ్చే వారం రష్యాతో చర్చలు జరిపేందుకు అధికారిక ప్రతిపాదనను తాము పంపినట్లు ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. శనివారం రాత్రి ఉక్రెయిన్ పౌరులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. చర్చల ప్రతిపాదనను జాతీయ భద్రతా మండలి కార్యదర్శి రుస్తెమ్ ఉమెరోవ్ రష్యా ప్రతినిధులకు అందజేశారని తెలిపారు. యుద్ధాన్ని ఆపేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఉక్రెయిన్ ప్రతిపాదనకు రష్యా సానుకూలంగా స్పందించింది. శాంతికి తాము సిద్ధమేనని తెలిపింది. అయితే యుద్ధంలో లక్ష్యాలను సాధించడం తమకు కీలకమని పేర్కొంది. ''ఉక్రెయిన్ సమస్యకు శాంతి పూర్వక పరిష్కారం సాధించాలన్న తన కోరికను అధ్యక్షుడు పుతిన్ గతంలో ఎన్నోసార్లు వెలిబుచ్చారు. ఇది సుదీర్ఘ ప్రక్రియ. దీనికి గట్టి ప్రయత్నం జరగాలి. అంత సులభం కాదు'' అని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు.



# ఉపరాష్ట్రపతితో కేజ్రీవాల్ భేటీ.. రాజకీయాల్లో సంచలనం !

ఈ కబురు: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ , ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌లు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ తో ఆదివారం భేటీ అయ్యారు. ఢిల్లీలోని వైస్ ప్రెసిడెంట్ నివాసంలో సమావేశమయ్యారు. 'ఉపరాష్ట్రపతి ఆరోగ్యంపై ఆరా తీసేందుకు ఆయనతో భేటీ అయ్యా. జగదీప్ ఆరోగ్యకరమైన జీవితం కోసం దేవుడిని ప్రార్థిస్తున్నా' అని కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వీరు ఎందుకు భేటీ అయ్యారోననే వివరాలు బయటకు రాలేదు. అయితే ఇండియా కూటమి నుంచి ఆప్ వైదొలడం, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ఒక రోజు ముందే ఉపరాష్ట్రపతితో కేజ్రీవాల్ సమావేశమవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు కేజ్రీవాల్ జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) చీఫ్ శిబూ సోరెన్‌తోనూ భేటీ అయ్యారు.



# చైనాలో తుఫాను బీభత్సం.. 400 భవనాలు ధ్వంసం



ఈ కబురు : చైనాలో టైఫూన్ విఫా బీభత్సం సృష్టిస్తున్నాయి. దక్షిణ చైనా తీరంలోని హైనాన్ ద్వీపం గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో తీవ్ర విధ్వంసం సృష్టించింది. గంటకు 140 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీశాయి. భారీ వర్షా లతో 400కు పైగా భవనాలు దెబ్బతిన్నాయి. 400 విమాన సర్వీసులు రద్దయ్యాయి. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. ఇక హాంకాంగ్‌లో T10 ప్రమాద హెచ్చరిక సిగ్నల్ జారీ చేశారు. మకావు, షెన్‌జెన్‌లో కూడా టైఫూన్ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఫిలిప్పీన్స్‌లో 370,000 మందిపై టైఫూన్ ప్రభావం పడింది. దాదాపు 43,000 మంది ఇళ్ళు ఖాళీ చేశారు. హైనాన్‌లో 8,30,000 గృహాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్వాంగ్‌డాంగ్‌లో 5,74,500 మంది సురక్షిత ప్రాంతాలకు తరలించబడ్డారు. ఈ టైఫూన్ కారణంగా విమానాలు, రైళ్లు, ఫెర్రీలను నిలిపివేశారు. పాఠశాలలు, అన్ని రకాల వ్యాపారాలను మూసివేసి అత్యవసర పరిస్థితి ప్రకటించారు. అయితే టైఫూన్ విఫా వియత్నాంకు కూడా చేరుకునే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

## 9-5 జాబ్ చేస్తే.. హర్ష్ గొయెంకా పోస్టు వైరల్



ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్‌పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గొయెంకా ఎప్పటికప్పుడు ఆసక్తికర అంశాలతో నెటిజన్లను పలకరిస్తుంటారు. తాజాగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీవితాంతం పనిచేస్తే ఎలా నష్టం జరుగుతుందనే దానిపై పోస్టు పెట్టారు.

హర్ష్ గొయెంకా ఎక్స్ వేదికగా పెట్టిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతుంది. ఆ వీడియోలో ఇంటర్న్‌షిప్ కోసం వచ్చిన ఓ విద్యార్థికి ఓ వ్యక్తి ఉద్యోగం ఇస్తాడు. నాలుగు గడుల మధ్య ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిల్చోవడమే అతడికి ఇచ్చే జాబ్. దీనికి ఓకే చెప్పి ఆ విద్యార్థి ఉద్యోగంలో చేరతాడు. ఇలా అతడి వయసు పెరిగేకొద్దీ అదే పని చేస్తూ ఉంటాడు. జీతం పెరుగుతుంది తప్ప అతడి జీవితంలో ఎలాంటి మార్పూ ఉండదు. చివరికి పదవీవిరమణ చేసేవరకు కూడా అతడు అదే కొనసాగిస్తాడు. ఇక వీడియో చివరిలో.. '95 పని చర్య మీ జీవితం మొత్తాన్ని లాగేసుకుంటుంది. ఇంకా ఆలస్యం కాకముందే మేల్కొండి' అనే సందేశంతో ముగుస్తోంది. ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండకుండా.. మార్పును స్వాగతించాలని గొయెంకా సూచించారు.

ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా.. పలువురు నెటిజన్లు దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. కొంతమంది గొయెంకాతో ఏకీభవించగా.. మరికొందరు వ్యతిరేకించారు. '95 షిఫ్టు ఒక ఎర. మీలో ఎంత ప్రతిభ ఉన్నా.. పదవీవిరమణ తర్వాత మీ స్థానంలోకి మీరు వచ్చేస్తారు. జీవితాన్ని ఆస్వాదించండి. వృథా చేయకండి' అని ఓ నెటిజన్ పేర్కొన్నారు. 'సర్ జీ మీ ఉద్యోగులకు ఈ వీడియో చూపించకండి. వాళ్లు దీన్ని అనుసరించాలనుకుంటే మీ సంస్థకే నష్టం' అని మరో నెటిజన్ కామెంట్ చేశారు.

## అంచనాలు మించిన ఐసీఐసీఐ బ్యాంక్




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశీయంగా రెండో అతి పెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభం (స్టాండెలోన్) రూ. 12,768 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం నమోదైన రూ. 11,059 కోట్లతో పోలిస్తే సుమారు 15 శాతం పెరిగింది. ఇది సుమారు రూ. 11,747 కోట్లుగా ఉంటుందని విశ్లేషకులు అంచనా వేశారు. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 10.6 శాతం పెరిగి రూ. 19,553 కోట్ల నుంచి రూ. 21,635 కోట్లకు చేరింది. ఇది సుమారు రూ. 20,923 కోట్లుగా ఉండొచ్చని అంచనాలు నెలకొన్నాయి.

ట్రెజరీ కార్యకలాపాలు మినహా, ఇతరత్రా ఆదాయం 13.7 శాతం పెరిగి రూ. 7,264 కోట్లకు ఎగిసింది. మరోవైపు, కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం 15.9 శాతం వృద్ధితో రూ. 13,558 కోట్లకు చేరింది. క్రితం క్యూ1లో ఇది రూ. 11,696 కోట్లు. మొత్తం వడ్డీ ఆదాయం రూ. 38,996 కోట్ల నుంచి రూ. 42,947 కోట్లకు చేరింది. అసెట్స్ రూ.24,07,395 కోట్ల నుంచి రూ. 26,68,636 లక్షల కోట్లకు చేరాయి.

**తగ్గిన ఎన్‌పీఏలు..**

సమీక్షాకాలంలో బ్యాంక్ అసెట్ నాణ్యత మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి (జీఎన్‌పీఏ) 2.15 శాతం నుంచి 1.67 శాతానికి దిగి వచ్చింది. నికర ఎన్‌పీఏ నిష్పత్తి 0.43 శాతం నుంచి 0.41 శాతానికి గ్గింది. నికర వడ్డీ మార్జిన్ 4.41 శాతం నుంచి 4.34 శాతానికి తగ్గింది. అయితే, ప్రొవిజనింగ్ భారీగా పెరిగింది. మార్చి త్రైమాసికంలో రూ. 1,332 కోట్లుగా ఉన్న ప్రొవిజనింగ్ రూ. 1,815 కోట్లకు ఎగిసింది. బ్యాంక్ షేరు ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 11 శాతం పెరిగి, దాదాపు రూ. 1,427 వద్ద ఉంది.

**డిపాజిట్లు 12.8% అప్**

సమీక్షా కాలం ఆఖరు నాటికి డిపాజిట్లు 12.8 శాతం పెరిగి రూ. 16,08,517 కోట్లకు చేరాయి. కాసా (కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్) నిష్పత్తి 38.7 శాతంగా ఉంది. కరెంట్ అకౌంట్ డిపాజిట్లు 11.2 శాతం, సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్లు 7.6 శాతం పెరిగాయి.

దేశీయంగా రుణాల పోర్ట్‌ఫోలియో 12 శాతం పెరిగి రూ. 13,31,196 కోట్లకు చేరింది.

నికర వడ్డీ మార్జిన్ 4.36 శాతం నుంచి 4.34 శాతానికి నెమ్మదించింది. వడ్డీయేతర ఆదాయం (ట్రెజరీ మినహాయించి) 13.7 శాతం వృద్ధితో రూ. 6,389 కోట్ల నుంచి రూ. 7,264 కోట్లకు చేరింది.

ఫీజు ఆదాయం వార్షికంగా రూ. 5,490 కోట్ల నుంచి 7.5 శాతం వృద్ధితో రూ.5,900 కోట్లకు పెరిగింది.

రిటైల్ రుణాలు వార్షికంగా 6.9 శాతం పెరిగాయి. మొత్తం లోన్ పోర్ట్‌ఫోలియోలో వీటి వాటా 52.2 శాతంగా ఉంది. కార్పొరేట్ పోర్ట్‌ఫోలియో 7.5 శాతం పెరిగింది.

క్యూ1లో బ్యాంక్ కొత్తగా 83 శాఖలు ప్రారంభించింది. దీంతో మొత్తం శాఖల సంఖ్య 7,066కి, ఏటీఎంలు, క్యాష్ రీసైక్లింగ్ మెషిన్ల సంఖ్య 13,376కి చేరుకుంది.



## రోజూ 2జీబీ హైస్పీడ్ డేటాతో జియో కొత్త ప్లాన్

ప్రముఖ ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ రిలయన్స్ జియో రోజూ 2జీబీ హైస్పీడ్ డేటాతో రూ .1049 ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. రోజువారీ హైస్పీడ్ డేటా, అపరిమిత కాలింగ్, టాప్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు ఉచిత యాక్సెస్ అందించే ప్రీపెయిడ్ ప్లాన్ కోసం చూస్తున్నట్లయితే ఈ జియో ప్లాన్ మీకు సరిగ్గా సరిపోతుంది. ఈ ప్లాన్ ప్రయోజనాలేంటో ఇక్కడ వివరంగా తెలుసుకోండి..

**ప్లాన్ వాలిడిటీ.. ప్రధాన ప్రయోజనాలు**

ఈ రూ .1049 జియో ప్లాన్ మొత్తం 84 రోజులు చెల్లుబాటు అవుతుంది. ఇందులో ప్రతిరోజూ 2 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. అంటే మొత్తం 84 రోజుల్లో మొత్తం 168 జిబి డేటా ఆనందించవచ్చు. దీంతోపాటు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా లభిస్తాయి. ఈ ప్లాన్ అతిపెద్ద ఫీచర్ ఇది అందించే ఉచిత ఓటీటీ యాక్సెస్. వినియోగదారులు ఎటువంటి అదనపు రుసుము చెల్లించకుండా అనేక ప్రసిద్ధ స్ట్రీమింగ్ సర్వీసులకు యాక్సెస్ పొందుతారు. వీటిలో అమెజాన్ ప్రైమ్ లైట్ (84 రోజులు చెల్లుబాటు అవుతుంది), సోనీలివ్, జీ5, జియోటీవీ, జియో హాట్‌స్టార్ (90 రోజులు, ఒకసారి చెల్లుబాటు అవుతుంది) వంటివి ఉన్నాయి. ఈ రీఛార్జ్ ప్లాన్ 50 జీబీ జియోఏఐక్లౌడ్ స్టోరేజ్, ఉచిత 5జీ డేటా (5జీ ఫోన్ అయి ఉండి 5జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉంటే మాత్రమే) వంటి జియో నుండి కొన్ని ఇతర ప్రత్యేక ప్రయోజనాలను కూడా అందిస్తుంది.

## ఎలక్ట్రిక్ కార్ల జోరు.. రానున్న రోజులు ఈవీలవే..



కొత్త మోడల్స్ ఎంట్రీతో పాటు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్ఈఈ) సరఫరా సమస్యలు సకాలంలో పరిష్కారమైతే, దేశీయంగా ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు మరింతగా పెరుగుతాయని కేర్‌ఎడ్జ్ అడ్వైజరీ ఒక నివేదికలో తెలిపింది. 2028 నాటికి దేశీయంగా మొత్తం కార్ల విక్రయాల్లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 7 శాతానికి చేరొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

ఎలక్ట్రిక్ కార్ల వినియోగం పెరగడమనేది, చార్జింగ్ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలపై కూడా ఆధారపడి ఉంటుందని కేర్‌ఎడ్జ్ అడ్వైజరీ అండ్ రీసెర్చ్ సీనియర్ డైరెక్టర్ తన్వి షా తెలిపారు. ఈవీల వినియోగం పెరగడానికి ప్రధాన అవరోధంగా ఉంటున్న చార్జింగ్ మౌలిక సదుపాయాలు ఇటీవలి కాలంలో గణనీయంగా మెరుగుపడ్డాయని పేర్కొన్నారు.

దేశీయంగా 2022 క్యాలెండర్ ఇయర్‌లో 5,151గా ఉన్న పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరం తొలినాళ్లలో 26,000కు చేరినట్లు నివేదిక తెలిపింది. మరోవైపు, 2021 ఆర్థిక సంవత్సరంలో సుమారు 5,000 యూనిట్ల స్థాయిలో నమోదైన ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు 2025 ఆర్థిక సంవత్సరం నాటికి 1.07 లక్షల యూనిట్లకు చేరాయి. సాధారణంగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల ఆధిపత్యం ఎక్కువగా ఉండే ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాల్లో ఫోర్ వీలర్ల వాటా చాలా తక్కువగానే ఉంటుంది.



## ట్రక్కుల వయసు మీరుతోంది

**దేశీయంగా మధ్య, భారీ వాణిజ్య వాహనాల (ఎం అండ్ హెచ్‌సీవీ-ట్రక్కుల విభాగం) సగటు వయసు పదేళ్లకు చేరింది. దీంతో వీటి స్థానంలో కొత్త వాహనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇది పరిశ్రమకు కలిసి రావొచ్చని తయారీ సంస్థలు, రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తున్నాయి.**

**ఎందుకిలా?**

కొవిడ్ సమయంలో భారీ వాహనాలకు గిరాకీ తగ్గడం, ఇటీవలి సంవత్సరాల్లోనూ విక్రయాలు బలహీనంగా నమోదు కావడంతో పాత వాహనాలు పెరిగిపోయి మొత్తం వాహనాల సగటు వయసు పదేళ్లకు చేరింది. ఇది రెండు దశాబ్దాల్లోనే అత్యధికంగా ఉంది. కొవిడ్ మహమ్మారి ప్రబలంగా ఉన్న సమయంలో వాహన యజమానులు కొత్త వాహనాల కొనుగోళ్లను వాయిదా వేశారు. దేశీయంగా ట్రక్కుల విక్రయాల పరిమాణం 2023 24లో స్థిరంగా ఉంది. 202425లో విక్రయాలు 4 శాతం తగ్గాయి. దీంతో వాహనాల సగటు వయసు పదేళ్లకు చేరడానికి దారి తీసిందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజల్ షా వెల్లడించారు.

**గిరాకీ పెరుగుతుంది!**

మన దేశంలో ట్రక్కుల వయసు మీరిన కారణంగా భర్తీ గిరాకీ (రీప్లేస్‌మెంట్ డిమాండ్) గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు. వాహన ఆపరేటర్లు మెరుగైన సాంకేతికత, వేగవంతమైన టర్నౌండ్‌తో కొత్త, మరింత సమర్థవంతమైన మోడళ్ల వైపు మొగ్గు చూపుతున్నారని ట్రక్కుల తయారీదార్లు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు 2023 ఏప్రిల్ 1 నుంచి 15 ఏళ్ల వయసు మీరిన ప్రభుత్వ వాహనాలను తుక్కుగా మార్చాలనే కచ్చితమైన నిబంధనతో మధ్య కాలానికి రీప్లేస్‌మెంట్ గిరాకీ పెరుగుతుందని భావిస్తున్నారు.

200910 నుంచి నేటి వరకు బీఎస్0బీఎస్6 ఉద్గార స్థాయి ట్రక్కులు సుమారు 37 లక్షలు విక్రయమయ్యాయి. గత 4 ఏళ్లలోనే సుమారు 10 లక్షల బీఎస్6 ట్రక్కులు విపణిలోకి వచ్చాయి. మరో 8.5 లక్షల వాహనాలు కొనసాగుతున్నాయి. అంటే 50 శాతం ట్రక్కులు గత 15 ఏళ్లలోనే విక్రయమయ్యాయి. వీటి సగటు వయసు 11 ఏళ్లను మించింది. అందుకే దేశీయ వాణిజ్య వాహన విభాగంలో వాహనాల వినియోగ జీవితం ముగింపునకు వచ్చిందని, రీప్లేస్‌మెంట్‌కు ఇదే సమయమని విశ్లేషకులు చెబుతున్నారు.

**60 శాతానికి రీప్లేస్‌మెంట్ విక్రయాలు**

రహదారుల మౌలిక సదుపాయాలు మెరుగైనందున, రీప్లేస్‌మెంట్ గిరాకీ బాగా పెరగొచ్చని వోల్వో ఐషర్ వాణిజ్య వాహనాల సీఈఓ, ఎండీ వినోద్ అగర్వాల్ వెల్లడించారు. గతంలో ట్రక్కులు నెలకు సుమారు 8,00010,000 కి.మీ. తిరుగుతుండగా, కొత్తగా వస్తున్న ట్రక్కులు 15,000 20,000 కి.మీ. ప్రయాణిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం రీప్లేస్‌మెంట్ విక్రయాల వాటా ట్రక్కుల విభాగంలో 60 శాతంగా ఉందని వినోద్ తెలిపారు. అయితే ఈ విభాగంలో మొత్తం విక్రయాలు మాత్రం గత గరిష్ఠ స్థాయికి చేరలేదన్నారు. 2019లో 2,95,000 వాహనాలు విక్రయమవగా ఇప్పటి వరకు ఇదే గరిష్ఠ స్థాయి. 202425లో 2,48,000 వాహనాలు అమ్ముడుపోయాయి. ట్రక్కుల విభాగం అధిక టన్నేజీ, పేలోడ్‌కు మారుతున్నందున, వీటి పరంగా 202425 ట్రక్కుల విక్రయాలు 10 శాతం పెరిగాయని అనుకోవచ్చని వినోద్ వివరించారు.

## తక్కువ వేతన జీవుల్లో 93% మందికి క్రెడిట్ కార్డులే ఆధారం




ముంబయి: ఖర్చులను తట్టుకునేందుకు క్రెడిట్ కార్డులపై ఆధారపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. నెలకు రూ.50,000 కంటే తక్కువ ఆర్జిస్తున్న వారిలో 93% మంది తమ అవసరాలు తీర్చుకునేందుకు క్రెడిట్ కార్డులనే ఆశ్రయిస్తున్నారని థింక్360.ఏఐ విడుదల చేసిన ఒక నివేదిక వెల్లడించింది. దేశంలో 20,000 మందికి పైగా వేతన జీవులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తుల ఆర్థిక ప్రవర్తనను 12 నెలల పాటు విశ్లేషించి, ఈ సంస్థ రూపొందించిన నివేదిక ప్రకారం..

స్వయం ఉపాధి పొందుతున్న వారిలో 85% మంది క్రెడిట్ కార్డులనే వాడుతున్నారు. దీంతోపాటు 'ఇప్పుడు కొనండి, తర్వాత చెల్లించండి (బీఎన్‌పీఎల్) సేవలను వాడుకుంటున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. స్వయం ఉపాధి పొందుతున్న వారిలో 20%, ఉద్యోగుల్లో 15% మంది ఈ సేవలను ఉపయోగించుకుంటున్నారు.

దేశంలో క్రెడిట్ కార్డులు, బీఎన్‌పీఎల్ ఇప్పుడు ఒక తప్పనిసరి అవసరంగా మారిందని థింక్360.ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ అమిత్ దాస్ అన్నారు. ఉద్యోగులు, వృత్తి నిపుణులతో పాటు, తాత్కాలికంగా ఉపాధి పొందుతున్న వారూ (గిగ్ వర్కర్లు) ఆర్థిక అవసరాల కోసం వీటిని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు.

ఫిన్‌టెక్‌లు డిజిటల్ రుణాల విషయంలో ఒక విప్లవాన్ని తీసుకొచ్చాయి. 2023లో ఫిన్‌టెక్‌లు రూ.92,000 కోట్లకు పైగా వ్యక్తిగత రుణాలను విడుదల చేశాయి. కొత్త రుణాల్లో ఇవి 76 శాతానికి సమానం. తక్కువ ఆదాయం ఉన్న వర్గాలు.. స్వల్ప కాలిక, డిజిటల్ ప్రధాన రుణాల వైపు మొగ్గు చూపిస్తున్నారని నివేదిక పేర్కొంది.

# జీవితంలో విజయం సాధించాలంటే మీరు చేయాల్సింది ఇదే.. స్టార్ హీరో ఇంట్రెస్టింగ్ కామెంట్స్



తమిళ స్టార్ సూర్య నటిస్తున్న వరుస చిత్రాల్లో 'కరుప్పు' ఒకటి. ఆర్.జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్ పోస్టర్ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేసింది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై రూపొందుతోన్న ఈ మూవీలో త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. స్వాసిక, ఇంద్రన్స్, యోగిబాబు, శశివాడ, నట్టి సుబ్రమణ్యం, సుప్రీత్ రెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. రీసెంట్‌గా ఈ సినిమా నుంచి గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్ త్వరలో రాబోతున్నట్లు తెలిపారు మేకర్స్. ఇదిలా ఉంటే.. రీసెంట్‌గా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న సూర్య సక్సెస్‌పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. 'ముందుగా.. జీవితంలో విజయం సాధించడానికి ఒక ముఖ్యమైన సూత్రం ఏమిటంటే.. మంచి అవకాశం వచ్చినప్పుడు దాన్ని అందిపుచ్చుకోవాలి. అలాగే రిస్క్ తీసుకోవడానికి వెనుకాడకూడదు. అలా చేస్తే అదే జీవితంలోని మరొక స్థాయిలో విజయం సాధించే అవకాశాలను పెంచుతుంది' అంటూ చెప్పుకొచ్చాడు.



# అప్పుడు అన్నం పెట్టిన సంస్థ.. ఇప్పుడు దిగజారి పోయింది

ఒకప్పుడు తనకు అన్నం పెట్టిన సంస్థ ఇప్పుడు ఇంతలా దిగజారి పోతుందని ఊహించలేదని నటి మాధవీలత ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. 'నేను ప్రముఖ చానెల్ లో యాంకర్ గా పని చేశాను. అలాగే హీరోయిన్ గా ఆ సంస్థలో (నచ్చావులే) లాంచ్ అయ్యాను. అది నాకు మాతృ సంస్థ కానీ ఇపుడు కుటుంబ సమేతంగా కొన్ని షోస్ చూడాలంటే సిగ్గుగా ఉంది. ఈ పోస్ట్ పెడుతున్నందుకు బాధగా కూడా ఉంది. ఇపుడు అంతా కాంపిటీషన్ వరల్డ్, ఒప్పుకుంటా కానీ ఎందుకో మితి మీరిన బూతులు, ఐటమ్ సాంగ్స్, బట్టలిప్పకున్న విధానం.. అమ్మ నాన్నతో కాదు నా ఫ్రెండ్స్ తో చూస్తున్నా అసౌకర్యంగా ఉంది. సామజిక బాధ్యతగా ఈ పోస్ట్ పెడుతున్నాను.

ఒకనాడు ఉన్నత విలువలకి నిదర్శనంగా ఉన్నందున సామాజిక బాధ్యతగా ఈ పోస్ట్ పెడుతున్నాను. సదరు సంస్థ నాకే కాదు ఎంతోమందికి అన్నం పెట్టింది. ఇప్పటికీ ఆ సంస్థల వాళ్ళు "మా అమ్మాయి " అంటారు. అందుకే ఈ బాధ..' అంటూ తీవ్ర విచారం వ్యక్తం చేసింది మాధవీలత. అంతేకాదు తాను గ్లామర్ కు వ్యతిరేకం కాదని కానీ మోతాదు మించిన వల్గారిటీ అవసరం లేదని, ఇదేం హాలీవుడ్ కాదని చెప్పుకొచ్చింది.



# గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి నజరానా

హైదరాబాద్: గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించింది. ఎన్నికల ముందు రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.10లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన రేవంత్‌రెడ్డి... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.కోటి ప్రోత్సాహకం అందిస్తామని చెప్పారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు పాతబస్తీ బోనాల సందర్భంగా తాజాగా.. రూ.కోటి నజరానా ప్రకటించారు. స్వయం కృషితో ఎదిగిన రాహుల్ సిప్లిగంజ్ యువతకు ఆదర్శమని ఈ సందర్భంగా సీఎం అన్నారు.

ఓల్డ్ సిటీ నుంచి 'ఆస్కార్' వరకూ వెళ్లిన కుర్రాడంటూ రాహుల్‌ను 'గద్దర్' అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో సీఎం రేవంత్ కొనియాడిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి అతడికి 'గద్దర్' పురస్కారం దక్కలేదని, అతడి ప్రతిభకు తగ్గ అవార్డుగానీ, మరో ప్రోత్సాహకంగానీ ఇవ్వాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు సూచించారు.

'కాలేజ్ బుల్లోడా', 'వాస్తు బాగుందే', 'రంగా రంగా రంగస్థలానా', 'బొమ్మోలే ఉన్నదిరా పోరి', 'నాటు నాటు' వంటి సినిమా పాటలు, 'ఓ నా రాహులా', బోనాలు, వినాయక చవితి తదితర స్పెషల్ సాంగ్స్‌తో రాహుల్ శ్రోతలను అలరించారు. 'రంగమార్తాండ'తో నటుడిగానూ ఆకట్టుకున్నారు.




# బుర్రకథ శిఖామణి జీవితంపై సినిమా

నిజజీవిత కథలు, సంఘటనలు స్ఫూర్తిగా తీసుకుని తెలుగులో ఎప్పటికప్పుడు సినిమాలు తీస్తూనే ఉంటారు. ఇప్పుడు అలా రాబోతున్న మరో మూవీ 'గరివిడి లక్ష్మి'. చాన్నాళ్ల క్రితమే ఈ చిత్రం నుంచి 'నల్లజీలకర్ర మొగ్గ' అని సాగే ఓ పాటని రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు గ్లింప్స్ విడుదల చేశారు. ప్రధాన పాత్రధారిని పరిచయం చేశారు.ఉత్తరాంధ్ర జిల్లాల్లో బుర్రకథ అంటే తెలియని వారుండరు. పండగలు, ఉత్సవాల టైంలో బుర్రకథల్ని ఎక్కువగా వేస్తుంటారు. 90ల కాలంలో దాదాపు 15 ఏళ్లలో ఏకంగా 10 వేలకు పైగా ప్రోగ్రామ్స్ చేసి గుర్తింపు తెచ్చుకున్న గరివిడి లక్ష్మీ అనే ఆమె జీవితం ఆధారంగా ఈ సినిమా తీసినట్లు చిత్రబృందం ఇప్పుడు క్లారిటీ ఇచ్చింది. గ్లింప్స్ కూడా సింపుల్‌గానే ఉంది. లక్ష్మీ పాత్రలో ఆనంది నటించబోతుంది. ఇదివరకే ఈమె.. జాంబీరెడ్డి, భైరవం తదితర సినిమాల్లో నటించింది.

# హీరో రామ్ రాసిన పాట.. యూట్యూబ్‌లో ట్రెండింగ్




రామ్ నటించిన కొత్త సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. త్వరలో థియేటర్లలోకి రానుంది. రీసెంట్‌గానే ఈ మూవీ నుంచి 'నువ్వుంటే చాలే' అని సాగే పాటని రిలీజ్ చేశారు. హీరో రామ్ ఈ పాటని రాయగా రాక్ స్టార్ అనిరుధ్ పాడటం విశేషం. ఇప్పుడిది సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిపోతోంది. సీజనల్ సాంగ్ ఆఫ్ ద ఇయర్‌గా మారిపోయింది.

మహేష్ బాబు.పి దర్శకత్వం వహించిన ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. మునుపెన్నడూ లేనివిధంగా ఈ సినిమాలో ఓ పాటకు రామ్ స్వయంగా లిరిక్స్ రాశాడు. ప్రేమకు నిజమైన అర్థాన్ని తెలుసుకునేందుకు హీరో చేసే ప్రయాణంలా ఈ సాంగ్ అనిపిస్తుంది. రిలీజ్ చేసిన గంటల వ్యవధిలోని ఇది మ్యూజిక్ లవర్స్‌కి బాగా నచ్చేసింది. ఇదే పాటలో రామ్, భాగ్య శ్రీ జంట చూడముచ్చటగా ఉంది. కెమిస్ట్రీ కూడా సినిమాకు ప్లస్ పాయింట్ కానుందనిపిస్తోంది.

# మరో బంపర్ ఆఫర్ అందుకున్న 'కన్నప్ప' హీరోయిన్.. ఈ స్పీడ్ మామూలుగా లేదుగా అంటున్న ఫ్యాన్స్



ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన అతి తక్కువ కాలంలోనే.. భారీ ప్రాజెక్ట్ 'కన్నప్ప'లో హీరోయిన్‌గా యాక్ట్ చేసి అందరిని ఆశ్చర్యపరిచింది యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్. ఇప్పడు ఈ అమ్మడు వరుస ఆఫర్లు అందుకుంటున్న సందడి చేస్తుంది. ఈ క్రమంలోనే రీసెంట్‌గా మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ మూవీలో ప్రీతి హీరోయిన్‌గా ఆఫర్ అందుకుంది. అఖిల్ సత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రీసెంట్‌గా పూజా కార్యక్రమాలతో స్టార్ట్ అయింది. ఇదిలా ఉంటే.. ఈ బ్యూటీ తాజాగా మరో బంపర్ ఆఫర్ అందుకున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ కింగ్ అర్జున్ మళ్లీ హీరోగా ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అయ్యాడు.

ఆయన నటిస్తున్న లేటెస్ట్ మూవీకి ప్రదీప్ అసిస్టెంట్ డైరెక్టర్ దర్శకత్వం వహిస్తుండగా.. AGS నిర్మిస్తోంది. ఇందులో అర్జున్ సరసన అభిరామి జతకట్టనుండగా.. అతని కూతురు పాత్రలో ప్రీతి ముకుందన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇది తండ్రీకూతుళ్ల సెంటిమెంట్ డ్రామాగా తెరకెక్కుతోందని తెలుస్తుండగా.. ఇందులో ప్రీతి పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉందట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు వైరల్ అవుతుండగా.. కెరీర్ స్టార్టింగ్‌లోనే స్టార్ హీరోల సినిమాల్లో చాన్సులు అందుకుంటుంది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు నెటిజన్లు.



## లెజెండరీ సచిన్ పక్కన నిలబడటం మరిచిపోలేని అనుభవం: జేమ్స్ అండర్సన్

ఇంగ్లాండ్ భారత్ జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్‌కు అండర్సన్ తెందూల్కర్ ట్రోఫీగా నామకరణం చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు పటౌడీ ట్రోఫీగా పిలిచేవారు. పటౌడీ పేరును మార్చడం పై ఇప్పటికే సచిన్ తెందూల్కర్ స్పందించాడు. తాజాగా జేమ్స్ అండర్సన్ కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. తొలిసారి ఇలాంటి అరుదైన ఘనతను సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించాడు. లెజెండరీ క్రికెటర్‌తో కలిసి ట్రోఫీని పంచుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించాడు.

"ఇప్పుడున్న క్రికెటర్లలో సచిన్ తెందూల్కర్ దిగ్గజం. అలాంటి క్రికెటర్‌తో కలిసి ట్రోఫీని పంచుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. మన పేరు మీద ఓ ట్రోఫీ ఉందంటే ఎప్పటికీ పెద్ద విషయమే. అదీనూ కప్ పక్కన సచిన్‌తో కలిసి ఉండటం భిన్నమైన అనుభూతి ఇస్తుంది. చిన్నప్పటి నుంచి సచిన్ ఆటను చూస్తూ పెరిగా. అతడికి ప్రత్యర్థిగా ఆడా. భారత్ ఆశలను తన భుజాలపై మోసిన ఐకానిక్ ప్లేయర్. అలాంటి క్రికెటర్‌తో కలిసి ట్రోఫీని ఆవిష్కరించడం బాగుంది. క్రికెట్‌లో నేను సాధించిన దాని గురించి ప్రజలు మాట్లాడుకొనేటప్పుడు.. నేనేనా ఇదంతా చేసిందని అనిపిస్తుంటుంది" అని అండర్సన్ వ్యాఖ్యానించాడు.

## 'పంత్.. క్రమశిక్షణతో బ్యాటింగ్ చెయ్.. ఆ షాట్లను ఐపీఎల్ కోసం దాచుకో'



రిషబ్ పంత్‌కు భారత మాజీ వికెట్ కీపర్ ఫారూక్ ఇంజినీర్ సున్నితంగా ఓ హెచ్చరిక చేశారు. టెస్టు క్రికెట్‌లో క్రమశిక్షణతో కూడిన బ్యాటింగ్ అవసరమని, రిస్కీ షాట్లను ఐపీఎల్ కోసం దాచుకోవాలని పంత్‌కు సూచించాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో పంత్ రాణిస్తున్నాడు. ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌ల్లో 425 రన్స్ చేశాడు. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్టుల్లో రెండు ఇన్నింగ్స్‌ల్లో (134, 118) శతకాలు బాదాడు. పరిస్థితులు ఎలా ఉన్నా పంత్ ఇంగ్లాండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగుతున్నాడు. వైవిధ్యమైన షాట్లు ఆడుతూ వేగంగా పరుగులు రాబడుతున్నాడు. ఈ క్రమంలో కొన్నిసార్లు తక్కువ స్కోరుకే వెనుదిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో పంత్ క్రమశిక్షణతో బ్యాటింగ్ చేయాలని ఫారూక్ ఇంజినీర్ సూచించాడు.

'కచ్చితంగా పంత్ ఆ రిస్క్ షాట్లను ఐపీఎల్ కోసం దాచుకోవాలి. టెస్టు క్రికెట్‌లో క్రమశిక్షణతో కూడిన బ్యాటింగ్ అవసరం. మూడు లేదా నాలుగో స్థానంలో వచ్చే బ్యాటర్లు సరైన క్రికెట్ ఆడి పెద్ద స్కోర్లు సాధించి ఇన్నింగ్స్‌ను నిర్మించాలని మనందరం ఆశిస్తాం. పంత్ ఒకే టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు చేశాడు. ఇది ఎంతో గొప్ప విషయం. రిషబ్ బలమైన ఇంగ్లాండ్ బౌలింగ్ లైనప్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ పూర్తిస్థాయి బ్యాటర్‌గా ఆడగలడు. అందుకు అతడు చేసిన పరుగులే నిదర్శనం. కానీ, పంత్ ఊహాలకు అందని వ్యక్తి. అతని మనసులో ఏదనిపిస్తే అది చేసేస్తాడు. ఓసారి షాట్ సెలక్షన్ గురించి అతనితో జోక్ చేశాను. అతను నవ్వుతూ 'ప్రస్తుతానికి ఏది సరైందనిపిస్తే అది చేస్తాను' చెప్పాడు. పంత్ అపారమైన ప్రతిభావంతుడు. కొత్త కొత్త షాట్లు ఆడతాడు. అతనిలో ఎంతో ఆత్మవిశ్వాసం ఉంది. అయితే, అప్పుడప్పుడు అది లోపిస్తోంది. భోజన విరామం లేదా ఆట ముగింపు వంటి సమయాల్లో పంత్ మరింత బాధ్యతాయుతంగా ఆడాలి' అని ఫారూక్ ఇంజినీర్ కోరాడు.

లార్డ్స్ టెస్టులో తొలి రోజు వికెట్ కీపింగ్ చేస్తూ పంత్ గాయపడిన సంగతి తెలిసిందే. తర్వాత అతని స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు. బుధవారం (జులై 23) నుంచి మొదలుకానున్న నాలుగో టెస్టులో పంత్ బ్యాటర్‌గా మాత్రమే బరిలోకి దిగే అవకాశముందని టీమ్ఇండియా అసిస్టెంట్ కోచ్ దస్కాటే హింట్ ఇచ్చారు.




## 2031 వరకు డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఇంగ్లాండ్‌లోనే.. ప్రకటించిన ఐసీసీ

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ 2031 వరకు ఇంగ్లాండ్‌లోనే జరుగుతుందని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2019 మొదలవగా.. ఇప్పటివరకు జరిగిన మూడు ఫైనల్స్‌కు ఇంగ్లాండ్ ఆతిథ్యమిచ్చింది. రాబోయే మూడు డబ్ల్యూటీసీ (2027, 2029, 2031) ఫైనల్ మ్యాచ్‌ల ఆతిథ్య హక్కులను కూడా ఇంగ్లాండ్ దక్కించుకుంది. గత మూడు ఎడిషన్లలో ఈసీబీ ట్రాక్ రికార్డ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐసీసీ ప్రకటించింది. గత మూడు డబ్ల్యూటీసీ ఫైనల్స్ సౌథాంప్టన్ (2021), ది ఒవల్ (2023), లార్డ్స్ (2025) వేదికగా జరిగిన సంగతి తెలిసిందే. గత నెలలో ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్‌లో సౌతాఫ్రికా విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతకుముందు రెండు ఎడిషన్లలో భారత్ ఫైనల్‌కు చేరగా.. 2021లో న్యూజిలాండ్, 2023లో ఆస్ట్రేలియా ఛాంపియన్‌గా నిలిచాయి.



# చరిత్ర సృష్టించేందుకు 25 పరుగుల దూరంలో శుభ్‌మన్ గిల్..

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు కోసం శుభ్‌మన్ గిల్ సారథ్యంలోనే భారత జట్టు మాంచెస్టర్‌లో అడుగుపెట్టింది. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానంలో టీమిండియా తీవ్రంగా శ్రమించనుంది. సిరీస్ సమమే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఓ అరుదైన రికార్డు ఊరిస్తోంది. ఇంగ్లండ్ గడ్డపై ద్వైపాక్షిక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆసియా బ్యాటర్‌గా చరిత్ర సృష్టించేందుకు గిల్ సిద్ధంగా ఉన్నాడు.

ప్రస్తుతం ఈ రికార్డు పాకిస్తాన్ క్రికెట్ దిగ్గజం మహ్మద్ యూసుఫ్ పేరిట ఉంది. అతడు 2006 ఇంగ్లండ్ టూర్‌లో భాగంగా నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 90.14 సగటుతో 631 పరుగులు చేశాడు. అతడి అత్యధిక వ్యక్తిగత స్కోర్ 202గా ఉంటుంది.

ఇప్పుడు మాంచెస్టర్‌లో శుభ్‌మన్ మరో 25 పరుగులు సాధిస్తే.. యూసుఫ్ ఆల్‌టైమ్ రికార్డును బ్రేక్ చేస్తాడు. ప్రస్తుత సిరీస్‌లో గిల్ ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడి 101.16 సగటుతో 607 పరుగులు చేశాడు. తొలి టెస్టులో సెంచరీతో చెలరేగిన గిల్.. అనంతరం బర్మింగ్‌హామ్ టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో ఏకంగా ద్విశతకంతో మెరిశాడు. అతడి అత్యధిక స్కోర్ 269గా ఉంది. ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆసియా బ్యాటర్లు

మహ్మద్ యూసుఫ్ (పాకిస్తాన్) 2006లో 4 మ్యాచ్‌ల్లో 631 పరుగులు

శుభ్‌మన్ గిల్ (భారత్) 2025లో 3 మ్యాచ్‌ల నుండి 607 పరుగులు

రాహుల్ ద్రవిడ్ (భారత్) 2002లో 4 మ్యాచ్‌ల నుండి 602 పరుగులు

విరాట్ కోహ్లీ (భారత్) 2018లో 5 మ్యాచ్‌ల నుండి 593 పరుగులు

సునీల్ గవాస్కర్ (భారత్) 1979లో 4 మ్యాచ్‌ల నుండి 542 పరుగులు

సలీమ్ మాలిక్ (పాకిస్తాన్) 1992లో 5 మ్యాచ్‌ల నుండి 488 పరుగులు


**గిల్‌కు కఠిన పరీక్ష..**

కాగా మాంచెస్టర్ టెస్టు రూపంలో గిల్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది. అండర్సన్‌టెండూల్కర్ ట్రోఫీలో ప్రస్తుతం భారత్ 12తో వెనుకబడి ఉంది. తొలి టెస్టులో ఓడిన అనంతరం టీమిండియా రెండో టెస్టులో ఘన విజయం సాధించింది. ఆ తర్వాత లార్డ్స్ టెస్టులో అనూహ్యంగా ఓటమి పాలైంది.

దీంతో ఇప్పుడు నాలుగో టెస్టు భారత జట్టుకు చాలా కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలవకపోతే సిరీస్ కోల్పోనుంది. కాబట్టి ఈ మ్యాచ్‌లో గిల్ తన కెప్టెన్సీతో జట్టును ఎలా నడిపిస్తాడో అని ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

## అక్కడ రద్దు.. మరి ఆ రెండు టోర్నీల్లోనూ భారత్ – పాక్ పోరు పరిస్థితేంటి?

**పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ పట్ల బీసీసీఐ మరింత కఠిన వైఖరిని అవలంభిస్తోంది. ఇప్పటి వరకూ కేవలం ఐసీసీ టోర్నీల్లోనే ఇరు జట్లు ఆడాయి. పహల్గాం దాడి అనంతరం పాక్‌తో ఏ వేదికపైనా ఆడేది లేదని బీసీసీఐ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. మాజీ క్రికెటర్లు కూడా దాయాదితో ఎలాంటి సంబంధాలు వద్దని గట్టిగా చెప్పారు. ఇప్పుడు వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లోనూ భారత్ - పాక్ మ్యాచ్ రద్దు అయిన సంగతి తెలిసిందే. శిఖర్ ధావన్, హర్భజన్, యువరాజ్ సింగ్.. ఇలా మాజీలు ఆ దేశంతో ఆడబోమని తెగేసి చెప్పడంతో నిర్వాహకులు మ్యాచ్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రభావం కేవలం ఇదొక్క టోర్నీ మీదే కాకుండా.. భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశం లేకపోలేదు.**




**ముందుంది ఆసియా కప్**

ఇప్పటికే ఆసియా కప్ నిర్వహణ కోసం ఓ వైపు ఏసీసీ మీటింగ్ పెట్టాలని చూస్తోంది. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా దీనికి వేదిక. అయితే, ఈ సమావేశానికి మేం వచ్చేది లేదని.. వేదిక మార్చాలని ఇప్పటికే బీసీసీఐ స్పష్టం చేసింది. ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నక్వీ పాక్ మంత్రిగానూ ఉన్నారు. వేదిక మార్పుపై ఆయన సానుకూలంగా లేరు. దీంతో ఆసియా కప్ నిర్వహణ కూడా కష్టమేనని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. దాయాదితో ఏ దశలోనూ ఆడే అవకాశం లేదని చెబుతున్న క్రమంలో ఆసియా కప్ నుంచి భారత్ వైదొలగడం లేదా పాక్‌ను తప్పించే అవకాశాలు ఉన్నాయి. టీమ్ఇండియా లేకుండా టోర్నీ నిర్వహణకు మిగతా బోర్డులు ముందుకు రావు. ఆర్థికంగానూ నష్టాలు ఉంటాయని వాటి భయం. ఐసీసీ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్‌లో ఆసియా కప్ జరగాల్సి ఉంది. గత ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలోనూ పాకిస్థాన్‌కు భారత్ వెళ్లని సంగతి తెలిసిందే. అప్పుడు దుబాయ్‌లోనే టీమ్ఇండియా మ్యాచ్‌లను ఆడింది. ఇప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తేనే పాల్గొంటామని బీసీసీఐ స్పష్టం చేసింది.

**వచ్చే ఏడాది పొట్టి కప్..**

కేవలం ఆసియాకప్ మాత్రమే కాకుండా.. మరో భారీ టోర్నీ ముందుంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచ కప్ జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీమ్ఇండియా బరిలోకి దిగనుంది. 20 జట్లు పాల్గొనే ఈ మెగా టోర్నీలో భారత్ పాక్ మ్యాచ్ హైలైట్ అనడంలో సందేహం లేదు.

మరోవైపు కేంద్ర క్రీడల మంత్రి మాత్రం 'అంతర్జాతీయ వేదికలపై పాక్‌తో భారత్ ఆడటంలో తమకు ఎలాంటి సమస్య లేదు' అని వ్యాఖ్యానించడం గమనార్హం. హాకీ ఆసియా కప్, జూనియర్ వరల్డ్ కప్ కోసం పాక్ క్రీడాకారులకు వీసా మంజూరు చేయడంపై సానుకూలంగా స్పందిస్తామని చెప్పారు. మరి అప్పటికైనా ఇరుదేశాల మధ్య పరిస్థితులు సద్దుమణిగితేనే ప్రపంచ కప్ మ్యాచ్‌ను చూసే అవకాశం ఉంటుంది. లేకపోతే ఆ మెగా టోర్నీలోనూ భారత్

# రోజర్ బిన్నీ తప్పుకుంటారా?

**70 ఏళ్లు పూర్తి చేసుకున్న బీసీసీఐ అధ్యక్షుడు**

**నిబంధనల ప్రకారం వైదొలగాలి**

**ఆశలు రేపుతున్న కొత్త క్రీడాబిల్లు**



**న్యూఢిల్లీ:** మాజీ క్రికెటర్, ప్రస్తుత భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ శనివారం (19 జూలై) నాటి పుట్టినరోజుతో 70 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఇప్పుడున్న జాతీయ క్రీడా నియమావళి (స్పోర్ట్స్ కోడ్) ప్రకారం ఏవరైనా క్రీడా సమాఖ్య కార్యవర్గ సభ్యుడు గరిష్టంగా 70 ఏళ్ల వయసు వరకే పదవిలో కొనసాగాలి. వయోపరిమితి మించితే వైదొలగాల్సి ఉంటుంది.

అయితే బీసీసీఐ ఒక స్వతంత్ర క్రీడా సంఘమైనా... మిగతా జాతీయ క్రీడా సమాఖ్యల మాదిరి భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) గొడుగు కింద లేకపోయినా... లాస్‌ఏంజెలిస్ ఒలింపిక్స్ (2028)లో క్రికెట్ ఉండటంతో ఇకపై స్పోర్ట్స్ కోడ్ ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల మీడియాలో ఆయన తప్పుకుంటారని, తాత్కాలిక అధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా బాధ్యతలు చేపడతారని వార్తలు ప్రముఖంగా వచ్చాయి. దీంతో అతను తప్పుకోవడంపై నేడో రేపో ప్రకటన ఉండొచ్చనే ఊహాగానాలు కూడా వినిపించాయి. కానీ బిన్నీ నుంచి అలాంటి ప్రకటన కాదు కదా... కనీసం సంకేతాలు కూడా రాలేదు.

**కొత్త 'కోడ్'పై కోటి ఆశలు**

రోజర్ బిన్నీ పదవిని వీడకపోవడానికి కారణం కూడా లేకపోలేదు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నూతన క్రీడా బిల్లును ప్రవేశపెట్టబోతోంది. దీనికి సంబంధించిన ముసాయిదా ఎప్పుడో సిద్ధమైంది. ఈ శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు ఈ బిల్లు రానుంది. ఇందులో ఉన్న కొత్త నిబంధన వృద్ధంద పిండాలకు ఊరటనిచ్చేలా ఉంది. గరిష్ట వయోపరిమితికి వెసులుబాటు కల్పిస్తుంది.

అంటే నామినేషన్ల సమయంలో 69 ఏళ్లకు పైబడి 70 ఏళ్లలోపు ఏ ఒక్కరోజు మిగిలున్నా... అలాంటి సందర్భంలో ఆ వ్యక్తి పోటీపడేందుకు... గెలిస్తే పూర్తి పదవీకాలం కొనసాగేందుకు కొత్త క్రీడా పాలసీలో అవకాశం ఉంది. దీంతో ఈ బిల్లు పాస్ అయితే 70 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వరకు బిన్నీలాంటివారు పదవిలో కొనసాగవచ్చు. పైగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)లో గరిష్ట వయోపరిమితి లేనేలేదు. ఒకవేళ విమర్శలు ఎదురైతే రాజీవ్ శుక్లాకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించడం లేదంటే స్పోర్ట్స్ కోడ్ బిల్లు వరకు వేచి చూసే ధోరణితో ఉండాలని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నాయి.